## క్లుప్తంగా

### విద్యుత్‌శాఖ సిబ్బంది జాగ్రత్తలు పాటించాలి



నడికూడ : విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా సిబ్బంది, వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలని ఏఈ కె.విశ్వప్రసాద్ అన్నారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలోని సబ్ స్టేషన్‌లో విద్యుత్ ప్రమాదాలపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఏఈ మాట్లాడుతూ.. తెగిన విద్యుత్ తీగలను, వర్షంలో కరెంటు స్తంభాలను ముట్టుకోవద్దని అన్నారు. విద్యుత్ అధికారుల, సిబ్బంది అనుమతి లేకుండా ఇతర వ్యక్తులు డీటీఆర్ ఫ్యూజులు వేసే ప్రయత్నం చేయవద్దని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయవద్దని సూచించారు. అనంతరం విద్యుత్ వినియోగంపై రూపొందించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్స్‌పెక్టర్లు మల్లయ్య, సదానందం, లైన్‌మెన్లు భిక్షపతి, సత్యనారయణ పాల్గొన్నారు.

### పల్లెల్లో ఓటింగ్ శాతం పెరగాలి



నర్సంపేట రూరల్ : పల్లెల్లో ఓటింగ్ శాతం పెరగాలని రాష్ట్ర వినియోగదారుల సీఏటీసీఓ కార్యదర్శి గిరగాని సుదర్శన్‌గౌడ్, స్వయంకృషి సంస్థ కార్యదర్శి బెజ్జంకి ప్రభాకర్, విజిలెన్స్ కమిటీ సభ్యుడు నాగెల్లి సారంగం కోరారు. నర్సంపేట మండలంలోని మాదన్నపేట, నాగుర్లపల్లి గ్రామ శివారులోని చెరువుల్లో పూడిక పనులు చేస్తున్న ఉపాధి కూలీలకు గురువారం కరపత్రాలు అందిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుదర్శన్, ప్రభాకర్, సారంగం మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో అర్హులందరూ ఓటేసేలా సమాజంలోని ప్రతీఒక్కరు కృషి చేయాలని కోరారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు.

### సమస్యలు పరిష్కరించండి

రాయపర్తి : తమ సమస్యలు పరిష్కరించాలని మండలానికి చెందిన ముస్లింలు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డిని కోరారు. స్థానిక మజీద్‌–ఏ–నూర్ సదర్ మహమ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలోని బృందం తొలుత ఎమ్మెల్యేను గురువారం మర్యాదపూర్వకంగా కలిసింది. అనంతరం హుస్సేన్ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మజీద్‌–ఏ–నూర్ కమిటీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ రజాక్, కోశాధికారి యూసుఫ్, సభ్యులు ఫెరోజ్, అఫ్రోజ్, షకీల్, వసీమ్, హఫీజ్, అమీర్, కమురొద్దీన్, అక్బర్, షకీల్, రియాజ్, మహబూబ్ పాషా, మల్సూర్, మహమూద్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

### 'మన ఆపద్బాంధవులు' ఫౌండేషన్ వార్షికోత్సవం



గీసుకొండ : మండలంలోని మనుగొండలో 'మన ఆపద్బాంధవులు' ఫౌండేషన్ నాల్గో వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జబ్బు వెంకటేశ్ ఆదేశాల మేరకు ద్యాగా అరవింద్ అందించిన ఆర్థికసాయంతో ఫౌండేషన్ ప్రతినిధి కర్ణకంటి రామ్మూర్తి–రజిత దంపతులు గ్రామానికి చెందిన అనాథ బాలలైన ఎర్రల స్వప్న, ఎలేంద్ర, శ్రీనులకు కుట్టు మిషన్, నెలకు సరిపడ బియ్యం, 14 రకాల నిత్యావసర సరుకులు అందించారు. అనంతరం రామ్మూర్తి మాట్లాడారు. ఇప్పటివరకు 4 వేల మందికి రూ.40 లక్షల విలువైన 14 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమ, నాయకులు రాజు, మాదాసి పద్మ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌తోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

వర్ధన్నపేట : కాంగ్రెస్‌తోనే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమని ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ స్పష్టం చేశారు. పట్టణంలోని భారతి డిగ్రీ కళాశాలలో 'ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం, సామాజిక న్యాయాన్ని సాధించుకుందాం, కాంగ్రెస్‌ను గెలిపించుకుందాం' కరపత్రాన్ని గురువారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలో మోదీ పాలన మొదలయ్యాక కోట్ల మంది పేదలు మరింత దారిద్ర్యంలోకి నెట్టబడ్డారని, 30 కోట్ల మంది యువత నిరుద్యోగులుగా వేదనకు గురౌతున్నారని, దేశంలోని 450 ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో కేంద్ర నిధుల్లేక పరిశోధన కుంటుపడిందని, 8 లక్షల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని కోరారు.

# దేదీప్యమానం.. ముఖ్యనాథస్వామి ఆలయం

- కాకతీయుల కాలంలో నిర్మాణం
- చుట్టూ గుట్టలు, పక్కన చెరువుతో ఆహ్లాదకరం
- పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని స్థానికుల విజ్ఞప్తి

ధర్మసాగర్ : కాకతీయు కాలం నాటి ఆలయం ఆనంద నిలయంగా ప్రతిద్ధిగాంచింది. చుట్టూ గుట్టలు, ఆలయం పక్కన చెరువు ఉండడంతో ఆహ్లాదంగా కనిపిస్తోంది. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామంలో కాకతీయ రాజుల కాలంలో నిర్మించిన ముఖ్యనాథ స్వామి దేవాలయం ఆహ్లాదం, ఆనందానికి కేరాఫ్‌గా మారుతోంది. ఈ ఆలయం పరిసర ప్రాంతంలో ఓ శాసనం బయటపడినట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.



పక్కనఉన్న పెద్ద చెరువుతో ఆహ్లాదంగా కనిపిస్తున్న ముఖ్యనాథస్వామి దేవాలయం

**11వ శతాబ్దంలో ఆలయ నిర్మాణం**

పూర్వం కాకతీయ సామ్రాజ్యాన్ని గణపతి దేవరాజు పరిపాలిస్తున్న 11వ శతాబ్దం కాలంలో ఆ రాజు ఆదేశాల మేరకు పెంత బొల్లిరెడ్డి కొమ్మసాని దంపతుల కుమారుడు పెంత మల్లిరెడ్డి ఓ దేవాలయాన్ని నిర్మించాడు. ఆ ఆలయంలో ప్రధాన దేవుడిగా రామేశ్వరున్ని ప్రతిష్టించి ఆలయాన్ని శివుడికి అంకితం చేశాడు. కాకతీయుల కాలంలో రామేశ్వర ఆలయంగా ప్రసిద్ధిగాంచిన ఈ క్షేత్రం.. ప్రస్తుతం ముఖ్యనాథ స్వామి ఆలయంగాను, ముప్పారంగాను రూపాంతరం చెందింది. అయితే ఈ ఆలయం యొక్క సంరక్షణ నిర్వహణ కోసం పెండివాయ దగ్గర మర్తురు, మిట్టకొమ్మ దగ్గర మర్తురు వద్ద భూదానం చేసినట్లు, ఈ ధర్మం చెడకుండా చూసిన వారికి శివలోకం ప్రాప్తిస్తుందని గణపతి దేవరాజు శాసనం రాయించినట్లు ఆ కాలం నాటి శిలాశాసనం ద్వారా తెలుస్తుంది. ఈ శిలాశాసనం ఉత్తరం దిశగా ఆలయానికి చెందిన బయ్యన్న బోడు అనే గుట్టపై కాకతీయుల కాలంలో ప్రతిష్టించి ఉందనే వినికిడి. ఆలయం ప్రధాన ద్వారం దక్షిణాది ముఖంగా నక్షత్ర ఆకారంలో త్రికూటాలయంగా నిర్మించారు. ఇందులో ప్రధాన దేవుడు శివుడు కాగా మిగిలిన గర్భాలయంలో విష్ణువు, సూర్యుడిని లింగరూపంలో కాకతీయులు ఆరాధించేవారు. ఆలయం యొక్క నిర్మాణ శైలి, వేయిస్తంభాల గుడి నిర్మాణ శైలి ఒకే రూపంలో ఉండడం విశేషం. కాకతీయ సామ్రాజ్యంపై దాడి జరిగిన సమయంలోనే ఈ ఆలయంపైనా కూడా దాడి చేసి ఇందులోని విగ్రహ మూర్తులను, ఇతర శిల్పాలను ధ్వంసం చేసినట్లు పూర్వీకులు చెబుతుంటారు.




ఆలయం చుట్టూ ఇనుపరాతి గుట్టలు

**కళలోకి వచ్చిన శివుడు**

కాకతీయుల కాలంలో దేదీప్యమానంగా వెలిగి మహోత్తరమైన పూజలు అందుకున్న ముఖ్యనాథ స్వామి ఆలయం నిర్మానుష్యంగా మారింది. వందల ఏళ్లుగా పూజలకు నోచుకోకపోవడంతో అటవీ ప్రాంతంలా మారింది. దుండగులు గుప్తనిధుల కోసం జరిపిన తవ్వకాలతో ధ్వంసమై శిథిలావస్థకు చేరింది. ఈ క్రమంలో అక్టోబర్ 04–2021 తెల్లవారు జామున ముప్పారం గ్రామానికి చెందిన శివసాని ప్రవీణ్ రవీంద్ర అనే శివ భక్తుడికి శివుడు కళలోకి వచ్చి నా ఆలయాన్ని బాగు(శుభ్రం) చేసి ఎల్లకాలం పూజలు జరిగే విధంగా చూడాలని చెప్పినట్టు ప్రవీణ్ రవీంద్ర తెలిపాడు. వెంటనే కొందరు భక్తులకు ఈ విషయం తెలియజేసి ఆలయాన్ని శుభ్రం చేసి పూజలు చేయడం ప్రారంభించారు. ఈ విధంగా వెలుగులోకి వచ్చిన ముఖ్యనాథస్వామిని దర్శించుకునేందుకు భక్తులు రావడం, పూజలు చేయడం ప్రారంభించారు. మొదట్లో కొంత ఆటంకం ఎదురైనా తరువాత ముప్పారం గ్రామ ప్రజలు ఏకతాటిపైనా నిలిచి ఆలయ అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యారు. అయితే 2022 సంవత్సరంలో శివరాత్రి ముందు రోజు పుట్టలో శివలింగం వెలుగు చూడడంతో వేలాధిగా భక్తులు తరలివచ్చి దర్శించుకుని చేసుకొని పూజలు, అభిషేకాలు చేశారు. ఈ ఆలయ పునర్‌నిర్మాణ వ్యవస్థాపక చైర్మన్ శివసాని ప్రవీణ్ రవీంద్ర ఓ ట్రస్ట్ ఏర్పాటు చేసి గ్రామస్తుల సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నాడు. మొదటగా దాతల సహకారంతో ఆలయానికి వచ్చేందుకు దారి ఏర్పాటు చేసి అప్పటి టీఎస్ ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ పిన్నింటి మోహన్‌రెడ్డి సహకారంతో ఒక కిలోమీటర్ దూరం నుంచి ఆలయానికి ప్రత్యేక విద్యుత్ లైన్ ఏర్పాటు చేయించారు. శిథిలావస్థకు చేరిన ఆలయాన్ని స్థపతుల సలహాలు, సూచనల మేరకు సాధ్యమైనంత వరకు ఆలయాన్ని బాగు చేసి ట్రస్ట్ ఆధ్వర్యంలో వేద పండితులు గూడ జగదీశ్వర్‌శర్మ(జగ్గయ్య శర్మ) నవంబర్ 19, 2023న పరివార దేవత సహిత శ్రీ ముఖ్యనాథస్వాములను పునఃప్రాణప్రతిష్ఠాపన చేశారు. దీంతో మండల ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు వేలాధిగా తరలివచ్చి పూజలు, అభిషేకాలు చేస్తున్నారు.



బయటపడిన శాసనం



ముఖ్యనాథస్వామి పురాతన ఆలయం



పునర్‌నిర్మించిన ఆలయం

**పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి**



హనుమకొండ నగరానికి కూతవేటు దూరంలో ఉన్న ముప్పారం గ్రామంలోని ముఖ్యనాథస్వామి ఆలయ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి. ఆలయం చుట్టూ ఇనుపరాతి గట్లు, పక్కనే పెద్ద చెరువు, పచ్చని పంటపొలాలు ఆహ్లాదకరమైన వాతావరణం ఉంది. రామప్ప, లక్నవరం, వేయిస్తంభాల గుడి మాదిరిగా ఈ ఆలయాన్ని అభివృద్ధి చేయాలి. కేంద్ర, రాష్ట్ర పర్యాటక, దేవాదయ శాఖల మంత్రులు, అధికారులు స్పందించి ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి.

– శివసాని ప్రవీణ్ రవీంద్ర, ఆలయ ట్రస్ట్ చైర్మన్

### పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ

నడికూడ : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లను గురువారం పరకాల ఏసీపీ కిశోర్ కుమార్ పరిశీలించారు. పోలింగ్ స్టేషన్‌లో ఏర్పాటు చేయాల్సిన మౌలిక సదుపాయాలు, పోలింగ్ జరిగే రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అధికారులకు వివరించారు. సీఐ రవిరాజు, ఎస్సై రమేష్ ,గ్రామపంచాయతీ కార్యదర్శి సందీప్, అంగన్‌వాడీ టీచర్ సంపూర్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### సభ పేరుతో రాజకీయం చేయొద్దు

దామెర : కులసంఘం సభ పేరుతో రాజకీయం చేయొద్దని రెడ్డి సంఘం మండల అధ్యక్షుడు కేతిపల్లి శ్రీధర్‌రెడ్డి కోరారు. గురువారం హనుమకొండలో నిర్వహించిన రెడ్డి కృతజ్ఞత సభకు కాంగ్రెస్ పార్టీకి చెందిన స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరుకావడంపై దామెర, ఆత్మకూరు మండలాలకు చెందిన పలువురు నాయకులు సభను బహిష్కరించినట్లు తెలిపారు. కుల సంఘం పేరుతో రాజకీయం చేయడం సరికాదని హితవు పలికారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని రాష్ట్ర నాయకులను కోరారు. రాజకీయాలకు అతీతంగా సంఘాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఆయన వెంట ఆత్మకూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు రేవూరి సంపత్‌రెడ్డి, కాంతాల రవీందర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కూనాటి సునీల్ రెడ్డి, పెండ్యాల మధుకర్, ఆవాల రవీందర్‌రెడ్డి, మన్నెం జయ్‌పాల్ రెడ్డి, రాజేందర్‌రెడ్డి ఉన్నారు.

### నేడు మండల సభ

శాయంపేట : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఫణిచంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ఉపాధి కూలీలకు రూ.600 చెల్లించాలి

- డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేష్

కమలాపూర్ : ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలందరికీ కొలతలతో సంబంధం లేకుండా రోజుకు రూ.600 చెల్లించాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జిల్లా అధ్యక్షుడు మాదాసు సురేష్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మండలంలోని శ్రీరాములపల్లి, అంబాల, నేరెళ్ల, లక్ష్మీపూర్ గ్రామాల్లో కొనసాడుతున్న ఉపాధి పనులను నాయకులతో కలిసి గురువారం పరిశీలించారు. పని ప్రదేశాల్లో నీడ, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు ఇతర సౌకర్యాలు కల్పించడం లేదని, తమకు గిట్టుబాటు కూలీ రావడం లేదని కూలీలు వాపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో అత్యధికంగా 70 కోట్ల మంది ఆధారపడి ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు కనీస వసతులు కల్పించకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని మండిపడ్డారు. మూడేళ్లుగా సమ్మర్ అలవెన్స్ ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తున్నాయని విమర్శించారు. ఉపాధి హామీ పనుల సంఖ్యను 200 రోజులకు పెంచాలని, గడ్డపార, పార, తట్ట తదితర పనిముట్లను ప్రభుత్వమే ఉచితంగా ఇవ్వాలని, వేసవి భత్యం 50 శాతం చెల్లించాలని, కూలీలకు సకాలంలో డబ్బులు అందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో డీబీఎఫ్ ఆధ్వర్యంలో దళిత, సామాజిక, ప్రజాసంఘాలు, వామపక్షలతో కలిసి మరో ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో డీబీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి పోలెపాక మల్లేశం, ఉపాధ్యక్షుడు పొరండ్ల అజయ్, కార్యదర్శి కొలిపాక రమేష్, మండల అధ్యక్షుడు మోరె ఐలయ్య, ఎఫ్ఏలు బాలరాజు, కిరణ్, మోహన్‌రావు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాదాసు సురేష్


## కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలు




కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో ఎమ్మెల్యే శ్రీహరి

ఐనవోలు : కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన సుమారు 80 మంది బీఆర్ఎస్ నాయకులు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తనను నమ్మి పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా అందరూ కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని గడపగడపకు తెలియజేయాలని సూచించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో మాజీ సర్పంచ్ గండి మల్లిక రమేష్, ఎండీ రంజాన్, లెక్కల వెంకటరెడ్డి, మహిళలు తదితరులు ఉన్నారు.

## పదోతరగతి విద్యార్థినులకు ఘన సన్మానం



నడికూడ : గాయత్రిని సన్మానిస్తున్న నాయకులు



వేలేరు : విద్యార్థులను సన్మానిస్తున్న యాదగిరి

నడికూడ : మండల కేంద్రానికి చెందిన ఆర్ఎంపీ, ఆరె సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు లోకటి నగేష్ కుమార్తె గాయత్రి ఇటీవల విడుదలైన పదోతరగతి పరీక్ష ఫలితాల్లో జీపీఏ సాధించింది. కాగా గురువారం వినియోగదారుల సమాచార కేంద్రం అధ్యక్షుడు మహ్మద్ జమాల్, ఆరె సంక్షేమ సంఘం విద్యావేత్తల వేదిక హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శిలు కోలె కృష్ణ, లాడే శివ విద్యార్థిని శాలువతో సన్మానించారు.

వేలేరు : ఇటీవల విడుదలైన పదోతరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో 9.7 సాధించి మండల టాపర్లుగా నిలిచిన మండల కేంద్రానికి చెందిన పల్లా సాహితి, సాహిత్యను 'కుడా' మాజీ డైరెక్టర్ బిల్లా యాదగిరి గురువారం శాలువాతో ఘనంగా సన్మానించారు. మరింత పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. చదువుతోనే భవిష్యత్ ఉందని తెలిపారు. చంద్రమౌళి, రాజయ్య, శ్రావణ్, సునీల్ పాల్గొన్నారు.

### ఎంపీగా కడియం కావ్యను గెలిపించాలి

పరకాల : వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్యను గెలిపించి ప్రత్యేక తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీకి బహుమతిగా ఇవ్వాలని కాంగ్రెస్ నాయకుడు రామకృష్ణ కోరారు. ఈ మేరకు మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి కావ్యను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కౌన్సిలర్ రాజు, బూత్ కమిటీ సభ్యులు ఆంజనేయులు, సాల్మన్, శ్రీను, వసంత, శంకర్, శ్రీనివాస్, నరేష్, సత్యకాంత్‌కుమార్, రామన్న, భాస్కర్, అనిల్‌కుమార్, సంపత్ పాల్గొన్నారు.

## పౌరులకు ఓటుహక్కు వజ్రాయుధం

- అర్హులందరూ వినియోగించుకోవాలి
- జిల్లా స్వీప్ నోడల్ అధికారి శ్రీనివాసరావు
- పట్టణంలో అవగాహన ర్యాలీ

పరకాల : ప్రజాస్వామ్యదేశంలో ఓటుహక్కు ఆయుధమని, అర్హులందరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని జిల్లా స్వీప్ నోడల్ అధికారి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని బస్టాండ్ నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు తెలంగాణ సాంస్కృతిక సారథి పుట్ట జానకి కళాకారుల బృందం ఆట, పాటలతో ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్ వద్ద మానవహారం చేపట్టి ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఓటుహక్కు పొందిన ప్రతిఒక్కరూ ఓటు వేయాలని కోరారు. 85 సంవత్సరాలు దాటిన వానికి ఇంటి వద్దనే ఓటు వేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. వయోవృద్ధులకు, దివ్యాంగులకు వాహన సౌకర్యం కల్పిస్తామన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో పోలింగ్ సమయాన్ని సాయంత్రం 6గంటల వరకు పొడగించిన విషయాన్ని గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కె.నారాయణ, ఏసీపీ కిశోర్‌కుమార్, ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, మున్సిపల్ కమిషనర్ నర్సింహ, అసిస్టెంట్ లేబర్ అధికారిణి రాజకుమారి, సీఐ రవిరాజు, సీడీపీఓ భాగ్యలక్ష్మీ, ఎంపీఓ ఇమ్మడి భాస్కర్, ఎంఈఓ రమాదేవి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వాతి, ఏపీఓ ఇందిరాతో పాటు పంచాయితీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

**ఎల్కతుర్తి** : మండలంలోని అర్హులందరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని భీమదేవరపల్లి మండలం ముల్కనూరు గ్రామపంచాయతీ కార్యదర్శి పూర్ణచందర్ అన్నారు. గురువారం చింతల బస్టాండ్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు మహిళలతో కలిసి ఓటరు అవగాహన ర్యాలీ, ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఓటర్లకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు స్వీప్ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. ఓటుహక్కు వినియోగం, ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రాజశేఖర్, ఆరోగ్య విస్తరణ అధికారి రాజేశ్వర్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**శాయంపేటలో..**

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో గ్రామపంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ ఆధ్వర్యంలో బీఎల్ఓలతో కలిసి స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కు ఆవశ్యకతను వివరించారు. ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వజ్రాయుధమని, అర్హులందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల సిబ్బంది, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

**దామెరలో..**

దామెర : అర్హులైన ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎంపీఓ రంగాచారి సూచించారు. మండల కేంద్రంలో గురువారం స్వీప్ కార్యక్రమం నిర్వహించి అవగాహన ర్యాలీ, ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఎంపీఓ మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని అన్నారు. కార్యదర్శి మనోహర్, కారోబార్ బొబ్బిలి, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

**ఆత్మకూరులో..**

ఆత్మకూరు : స్థానిక గ్రామపంచాయతీ కార్యదర్శి మేడ యాదగిరి ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మహిళలు మానవహారం చేపట్టి ఓటుహక్కును వినియోగంచుకోవాలని నినాదాలు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పరకాల : ర్యాలీ, మానవహారం చేపట్టిన అధికారులు, సిబ్బంది



దామెర : ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది



ఆత్మకూరు : మానవహారం చేపట్టిన మహిళలు



ఎల్కతుర్తిలో..



శాయంపేట : ర్యాలీ నిర్వహిస్తున్న బీఎల్ఓలు

### మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

నడికూడ : మండల కేంద్రంలో పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు గురువారం నాగుర్ల యువసేన సభ్యులు లోకటి నగేష్ మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఎండలు తీవ్రస్థాయిలో ఉన్నందున జాగ్రత్తలు పాటిస్తూ పనులు చేయాలని కూలీలకు సూచించారు. ఉదయం పూటనే పనుల్లోకి వచ్చి త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. రానున్న రోజుల్లో ఎండతీవ్రత అధికంగా ఉంటుందని తెలిపారు. నర్సక్కపల్లిలో ఎంపీటీసీ బుర్ర దీపాగౌడ్ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

### మాయమైన ఎంబీ రికార్డు అప్పగింత

దామెర : మండలంలోని ల్యాదెళ్ల గ్రామపంచాయతీలో మాయమైన ఎంబీ రికార్డు గ్రామకార్యదర్శికి చేరుకుంది. గ్రామపంచాయతీ పాలక మండలి గడువు ముగిసి నెలలు గడుస్తున్నా జీపీకి సంబంధించిన 804 నంబరు గల ఎంబీ రికార్డు కనిపించకపోవడంతో గ్రామంలో చర్చనీయాంశమైంది. ఇటీవల వార్త పత్రికల్లో ప్రచురించగా ఎంపీఓ రంగారి విచారణ చేపట్టారు. కాగా మాజీ వార్డు సభ్యుడు భరత్ గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనికి సంబంధించిన వివరాలు నమోదు చేసేందకు తీసుకెళ్లి పీఆర్ ఏఈఈకి అప్పగించాడు. దీన్ని ఆరాతీసిన మాజీ సర్పంచ్ భర్త అనిల్ గురువారం రికార్డును కార్యదర్శి అన్నపూర్ణకు అప్పగించారు.



ఎంబీ రికార్డును అప్పగిస్తున్న అనిల్